


అక్టోబరు 4న ఐఆర్‌సీఎస్ సమావేశం

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్‌లోని లయన్స్‌క్లబ్ భవనంలో అక్టోబరు 4న ఉదయం 10.30గంటలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) జిల్లా సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు సంబంధించిన ఐఆర్‌సీఎస్ జిల్లా కార్యవర్గం, ఎజెండాలోని పలు అంశాలపై చర్చించడం జరుగుతుందని చెప్పారు. రెడ్‌క్రాస్ సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

విమోచనోద్యమంలో నెత్తురోడిన మానుకోట



నెల్లికుదురులో చరిత్రాత్మకమైన పోలీస్‌స్టేషన్ (ఫైల్)

21 మంది నిజాం విమోచన పోరాట అమరుల స్తూపం (ఫైల్)

- బయ్యారంలో 20 మంది అమరుల స్తూపం
- నెల్లికుదురు పోలీసు శిబిరంపై సాయుధ దాడి
- రేపు నిజాం విమోచన దినం

మహబూబాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంత నెత్తుటి చరిత్రలో 'నిజాం విమోచనం' సువర్ణాక్షరాలతో లిఖించబడిన మహోజ్వల ఘట్టం. అప్పటి నిజాం రాజరిక పాలనకు వ్యతిరేకంగా పూర్వ ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లోని 250 గ్రామాలు కలుపుకుని నాటి మానుకోట పాత తాలూకా ప్రస్తుత మహబూబాబాద్ జిల్లా ప్రాంత ప్రజల వీరోచిత పోరాటాలు, చేసిన త్యాగాలు ఎన్నెన్నో... 1947 ఆగస్టు 15న బ్రిటీష్ పాలకులచే విముక్తినొంది స్వతంత్ర్య భారతావని అవతరణకు సిద్ధం కాగా, నైజాం సంస్థానం ఇండియన్ యూనియన్‌లో చేరదని 'ఆజాద్ హైదరాబాద్ (స్వతంత్ర్య రాజ్యం)'గా ఉంటుందని నిజాం రాజు ప్రకటించారు. దీంతో తెలంగాణలో నిజాం విమోచన పోరాటం ఆరంభమైంది. మానుకోట తాలుకాలో సర్ మీర్జా ఉస్మాన్ అలీఖాన్ నిజాం రాచరిక పాలనతో ప్రజలు బానిస పీడనకు ఉక్కిరి.. బిక్కిరయ్యారు.

పెరుమాండ్ల సంకీసలో 21 మంది అమరత్వం

విమోచన పోరాటంలో తుమ్మె శేషయ్య నేతృత్వాన డోర్నకల్ మండలం పెరుమాండ్ల సంకీసలో సమరయోధులకు సాయుధ శిక్షణ ఇస్తున్న సమాచారంతో నిజాం సేనలు ఆ గ్రామాన్ని చుట్టు ముట్టి పొలం పనులకు వెళ్లే 21 మందిని అడ్డుకొని ఒక చోట కూర్చొబెట్టి రాక్షసంగా కాల్చి చంపారు. ఈ దురాగతంలో కూరపాటి సత్తయ్య, గండు ముత్తయ్య, కాసం లక్ష్మీనర్సయ్య, బీరెడ్డి నర్సయ్య, దేశబోయిన వీరవెంకయ్య, కనకం కిష్టయ్య, కనకం సర్వయ్య, గంగ్రాతి రామయ్య, తేరాల గురవయ్య, తేరాల రామయ్య, తేరాల లాలయ్య, నాయిని అప్పయ్య, సోమనబోయిన రాములు, శెట్టి పెద్దనర్సయ్య, శెట్టి రామయ్య, దాసరి కిష్టయ్య, శెట్టి చిన్ననర్సయ్యలు అమరులయ్యారు. ఇందులో కొనఊపిరితో ఉన్న కొందరిని గడ్డివాములో వేసి సజీవ దహనం చేశారు. ఆపై నిజాం మూకలు అమితానందంతో శవాలపై నడుచుకుంటూ వెళ్లాయి. వెళ్తూవెళ్తూ మరికొందరిని కాల్చిపోయారు. 1948 జనవరి 9న పెరుమాండ్లసంకీసలో అమరుల స్మారక స్తూపాన్ని ఏర్పాటు చేశారు.



రజాకార్లు 21మందిని తుపాకులతో కాల్చి సజీవ దహనం చేసిన పెరుమాండ్ల సంకీస గ్రామం (ఫైల్)

పెరుమాండ్ల సంకీసలో 21 మంది అమరత్వం

గార్ల జాగీరులో బయ్యారం..

గార్ల తహసీల్దార్ కొడుకు కర్కోటకుడిగా మారి ప్రజలను పీడిస్తుండడంతో పెత్తాళ్లగడ్డ వద్ద గడ్డం వెంకట్రామయ్య నాయకత్వంలో సాయుధ దాడి జరిపారు. బయ్యారం మండలం కోటగడ్డ జమీందార్ రంగారెడ్డి దేశ్‌ముఖ్‌పై ప్రజల వీరోచిత పోరు నడిచింది. బండ్లకుంట గ్రామంలో నిజాం సైన్యాలతో జరిగిన హోరాహోరీ పోరులో గెరిల్లా దళాల కమాండర్లు దామినేని వెంకటేశ్వరరావు, కంచర బుచ్చిమల్లుతో పాటు బండ్లకుంట గ్రామానికి చెందిన బీరవెల్లి లక్ష్మయ్య, కంబాల చంద్రయ్య, ఆయలబోయిన యర్రయ్య, సింగనబోయిన గంగయ్య, లింగయ్య, కారం మల్లయ్య, పాశం లచ్చయ్య, మాడె పాపయ్య, మాడె బుచ్చయ్య, తాటి బాలయ్య, మోకాళ్ల యర్రయ్య, భూక్య సక్రాం, వేములపల్లి శ్రీక్రిష్ణ, తాటి లక్ష్మయ్య, తాటి యల్లయ్య, పెడుగుల లక్ష్మీనర్సయ్య, కుంజ ముత్తిలింగయ్య, కారం గాదెయ్య, యేపె బాలయ్య కుంజ జోగయ్యతో 20 మంది అమరులయ్యారు. 1948లో అమరులైనా వీరి పేరిట బయ్యారం గాంధీ సెంటర్‌లో 1969లో స్మారక స్తూపాన్ని ఏర్పాటు చేసి ప్రతియేటా నివాళులర్పిస్తున్నారు.

నాటి నెల్లికుదురు పోలీస్‌స్టేషన్‌పై..

నెల్లికుదురు ప్రాంతంలో బంజరుదారు జానిమియా నాయకత్వాన రజాకార్లు, పోలీసులు, దొరలు 50 గ్రామాలపై దౌర్జన్యాలు సాగించారు. గుర్తురు, అమ్మాపురం, మేచరాజుపల్లికి చెందిన దళసభ్యులు ఓడపల్లి పుల్లయ్య, కడుదుల గోపయ్యలను నెల్లికుదురు క్యాంపునకు తీసుకువెళ్లి కాల్చిచంపారు. దీంతో తీగల సత్యనారాయణరావు, మంచికంటి రాంకిషన్‌రావు, రాజిరెడ్డి, నర్సింహరెడ్డి, పుల్లయ్య, తమ్మెర వెంకటరామనర్సయ్య, పిప్పళ్ల వెంకట్రామయ్య, వాసిరెడ్డి కృష్ణరెడ్డి, చిర్రలింగయ్య, మరికొందరు సాయుధ దళాలు 1948 సెప్టెంబరు 11న నెల్లికుదురు పోలీస్‌స్టేషన్‌పై కాల్పులు ఆరంభించాయి. అటు నుంచి ఎదురుకాల్పులు మొదలయ్యాయి. మరోపక్క మడిపెల్లి, బ్రాహ్మణకొత్తపల్లి ప్రాంతాల నుంచి రాజిరెడ్డి, కొండల్‌రెడ్డి నాయకత్వాన శిక్షణ పొందిన దళాలు వచ్చి నెల్లికుదురు పోలీసు శిబిరంపై కాల్పులు జరిపాయి. ఆ తర్వాత క్రమంలో పోలీసు పెద్ద లొంగిపోయినట్టు ప్రకటించారు. నాటి చరిత్రాత్మకమైన పాత పోలీస్‌స్టేషన్ భావితరాలకు గుర్తుండేలా నేటికీ అలాగే ఉంది.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

తప్పుడు ప్రచారాలు మానుకోండి

- మేడారం అభివృద్ధిని వ్యతిరేకించడం అవివేకం
- ఆదివాసీలు, పూజారుల అభీష్టం మేరకే శాశ్వత పనులు
- సంస్కృతీ సంప్రదాయాలను పరిగణనలోకి తీసుకుంటాం
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క

తాడ్వాయి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మేడారం అభివృద్ధిపై కొందరు పనిగట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలాంటి దుశ్చర్యలను మానుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం తాడ్వాయి మండలంలోని మేడారంలో ఆమె పర్యటించారు. పూజారులు, అధికారులతో సమావేశమయ్యారు. ఆదివాసీ సంప్రదాయాలకు అనుగుణంగా మేడారంలో రాతి కట్టడాలతో చేపట్టనున్న శాశ్వత నిర్మాణాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వనదేవతలు సమ్మక్క, సారలమ్మ అంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎనలేని విశ్వాసం అని తెలిపారు. చరిత్రలో నిలిచిపోయేలా మేడారంలో అభివృద్ధి పనులు చేపట్టారని అన్నారు. ఇందుకు రూ.150 కోట్లు మంజూరు చేశారన్నారు. మరిన్ని నిధులు మంజూరు చేయడానికి సీఎం సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మేడారంలో అభివృద్ధి పనులను పూజారులు, ఆదివాసీల అభిప్రాయం మేరకే చేపడతామన్నారు. 700 చిత్రాలు, గొట్టు గోత్రాలు, సంస్కృతీ సంప్రదాయాలు, వనదేవతల చరిత్రలు, ఆదివాసీల మూలాలు శాశ్వతంగా నిలిచిపోయేలా రాతి కట్టడాలపై లిఖించనున్నట్టు తెలిపారు. దేవస్థానం అభివృద్ధిపై కొందరు పనిగట్టుకొని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, ఇది సరికాదని అన్నారు. ఆదివాసీలు, పూజారుల అభిప్రాయం మేరకు రూపొందించిన దేవస్థానం డిజైన్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించనున్నట్టు తెలిపారు.

సుదీర్ఘంగా చర్చించాకే కొత్త డిజైన్లు : జగ్గారావు

మేడారం దేవస్థానం అభివృద్ధిపై తప్పుడు ప్రచారాలు మానుకోవాలని పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు అన్నారు. మేడారం సమ్మక్క-సారలమ్మ, పడిగిద్దరాజు, గోవిందరాజుల చరిత్రలు పుట్టుపూర్వం ఆదివాసీల మూలాలు, పడగలు, గొట్టు, చిహ్నాలు, జీవిత చరిత్రలు వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించి నూతనంగా డిజైన్లు రూపొందించారని తెలిపారు. రూపొందించిన దేవస్థానం అభివృద్ధిపై తమకు ఎలాంటి సందేహాలు లేవని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, పూజారులు మునీందర్, కృష్ణయ్య, సారయ్య, కిరణ్, సిద్ధబోయిన స్వామి, రఘుపతిరావు, రమేష్, అధికారులు, ఆదివాసీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్

72 ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిలిచిపోనున్న చికిత్సలు



వరంగల్ మెడికల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం బకాయిలను విడుదల చేయకపోవడంతో రాష్ట్ర వ్యాప్త బంద్ పిలుపులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోనున్నాయి. మంగళవారం రాత్రి నుంచి (మిగతా 8లో..)

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి
- కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

తొర్రూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నిరుపేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివిధాలా కృషి చేస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. సోమవారం తొర్రూరులోని తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఆడబిడ్డల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తుందన్నారు. ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు వైద్య చికిత్స కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వైద్య ఖర్చులకు, అత్యవసర సమయాల్లో ఆర్థికంగా సహకరిస్తుందని తెలిపారు. నియోజకవర్గంలో ప్రజలు ప్రమాదాల బారిన పడితే తమ దృష్టికి తీసుకువస్తే చికిత్స కోసం ఆర్థికంగా సాయపడతామన్నారు. 78మంది లబ్ధిదారులకు రూ.78లక్షల విలువైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.1కోటి 71లక్ష 22వేల చెక్కులు అందించామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు సోమ రాజశేఖర్, మేకల కుమార్, పెదగాని సోమయ్య, బాపురెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, సదాకర్, దొంగరి రేవతి శంకర్, తూనం శ్రావణ్, సురేష్, బిజ్జాల అనిల్, మహేశ్వరి, సోమిరెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, వెంకన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కుల పంపిణీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

ఘనంగా మహిళా కాంగ్రెస్ దినోత్సవ వేడుకలు

తొర్రూరు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహిళా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి హాజరై కేక్‌కట్ చేసి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ మహిళలకు ప్రాధాన్యత ఇస్తుందని, మహిళలు రాజకీయాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మహిళా కాంగ్రెస్ 41 ఏళ్ల ప్రస్థానం ఎంతో గర్వకారణంగా ఉందని, పార్టీ బలోపేతానికి మహిళా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ మహిళా అధ్యక్షురాలు ఉష, మహేశ్వరి, దొంగరి రేవతి, సునీత, అండాలు, ఉపేంద్ర, మహిళలు పాల్గొన్నారు.

యూరియా కోసం..

- సావిత్రిని మించి నటిస్తున్న సత్యవతి
- ప్రభుత్వ విప్ రాంచంద్రు నాయక్ వ్యాఖ్యలు
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియో



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ జాటోత్ రాంచంద్రు నాయక్

మరిపెడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి సత్యవతిరాథోడ్‌పై ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రు నాయక్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ.. కలకలం రేపుతున్నాయి. రాంచంద్రునాయక్ డోర్నకల్ కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి హైదరాబాద్ మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మాజీ మంత్రి సత్యవతిపై చేసిన వ్యాఖ్యల వీడియోను ఆ పార్టీ కార్యకర్తలు సోషల్ మీడియాలో వైరల్ చేశారు. రాంచంద్రునాయక్ మాట్లాడిన వీడియోలో సత్యవతి యూరియా కోసం చేసిన నటన నటి సావిత్రిని మించి పోయిందని ఎద్దేవా చేశారు. పది బస్తాల యూరియా టోకెన్ తీసుకొని రైతులకు ఒక్క బస్తా ఇస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదునాం చేసేలా నటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మహబూబాబాద్ జిల్లా యంత్రాంగాన్ని కలెక్టర్, ఎస్పీ షైఅల్టర్ చేస్తూ రైతులకు సకాలంలో యూరియా అందేలా కష్టపడుతున్న విషయాన్ని ఆయన ప్రజలకు గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వాన్ని వెనుకేసుకొస్తూ రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం మాజీ మంత్రికి తగదని హితవు పలికారు. విప్ రాంచంద్రునాయక్ వెంట నూకల శ్రీరంగారెడ్డి తదితరులు ఉన్నారు.



రోడ్డెక్కిన అంగన్‌వాడీలు

- పీఎంశ్రీ పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్
- మంత్రి సురేఖ ఇంటి ముట్టడి
- మంత్రి హామీతో ఆందోళన విరమణ

మంత్రి కొండా సురేఖ ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

7

ముగ్గురిపై దాడికి దారితీసిన 'కోతి' భయం!

రాణాకు చేరిన పంచాయతీ

కురవి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కోతి భయం.. చివరకు ఒక బాలుడిపై నుంచి తాత, తండ్రిపై దాడికి దారితీసిన ఉదంతమిది. జిల్లాలోని కురవి మండలం కంచర్లగూడెం తండాలో జరిగిన ఈ సంఘటనపై ఎస్సై గంగ్రాతి సతీష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కురవి మండలం కంచర్లగూడెం తండాలో ఓ కిరాణం షాపునకు చాక్లెట్లు కొనుక్కునేందుకు వెళ్తున్న బాలుడిని కోతులు బెదిరించడంతో అదే కిరాణా షాపులోకి వెళ్లి దాక్కున్నాడు. బాలుడు ఆకాష్‌ను గమనించిన షాపు యాజమానులు విపరీతంగా కొట్టారు. ఆకాష్‌ను వెతుక్కుంటూ వెళ్లిన తాత (మిగతా 8లో..)



కంచర్లగూడెం తండాలో దాడిలో గాయపడ్డ గుగులోతు ఆకాష్

భర్తపై హత్యాయత్నం

- ప్రియుడితో కలిసి దాడి చేసిన భార్య
- వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని దారుణం
- మహబూబాబాద్ మండలం గడ్డిగూడెంలో ఘటన



జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మేడ ప్రసాద్

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని భర్తపై కక్ష పెంచుకున్న భార్య ప్రియుడితో కలిసి దాడికి పాల్పడింది. ఆమె భర్తను పట్టుకోగా.. ప్రియుడు కత్తితో పొడిచాడు. ఈ సంఘటన మహబూబాబాద్ మండలంలోని గడ్డిగూడెంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధితుడి తండ్రి పాపయ్య తెలిపిన వివరాల ప్రకారం... గడ్డిగూడెం గ్రామానికి చెందిన మేడ పాపయ్య-భద్రమ్మల పెద్ద కుమారుడు మేడ ప్రసాద్‌కు పాకాల కొత్తగూడెం గోవిందాపురం గ్రామానికి చెందిన ఈక రాజు-సుమలత కుమార్తె రష్మితతో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. ఆ దంపతులకు కుమారుడు సంతానం. ప్రసాద్ గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. 6 నెలల క్రితం రష్మితకు ఇన్‌స్టాగ్రామ్‌లో మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం మర్రిగూడెం గ్రామానికి చెందిన మద్దెల అనిల్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. అది కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. దీనికి భర్త ప్రసాద్ అడ్డు వస్తున్నాడనే కారణంతో ప్రియుడితో కలిసి భర్తను చంపేయాలని నిర్ణయానికి వచ్చారు. ఈ నెల 14న రాత్రి ప్రసాద్ భార్య రష్మిత ప్రియుడు అనిల్‌కు ఫోన్ చేసి గడ్డిగూడెంకు రప్పించింది. కుటుంబ సభ్యులు గాఢ నిద్రలోకి జారుకున్న అనంతరం ప్రియుడు అనిల్, రష్మిత కలిసి భర్త ప్రసాద్‌పై కత్తితో దాడి చేయడంతో చెవి, ఛాతి, చేతులు, కాళ్లపై గాయాలయ్యాయి. దీంతో అతను కేకలు వేయడంతో పక్కనే ఉన్న తల్లిదండ్రులు, సోదరుడు ఇంటికి వచ్చారు. దాడి చేసిన అనిల్‌ను తాళ్లతో చెట్టుకు కట్టేసి మహబూబాబాద్ రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని అనిల్, రష్మితను అదుపులోకి తీసుకుని మానుకోట రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా, తీవ్రంగా గాయపడ్డ ప్రసాద్‌ను కుటుంబ సభ్యులు మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిగా తరలించి చికిత్సనందిస్తున్నారు. కాగా, బాధితుడి తండ్రి పాపయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దీపికారెడ్డి తెలిపారు.

ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి చేయాలి

నర్సింహులపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఈవో రాంమ్మోహన్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని బంగారు తండా ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సందీప్ తన మిత్రుల సహకారంతో విద్యార్థులకు టై, బెల్టు, పరీక్ష ప్యాడ్, వాటర్ బాటిల్, ప్లేట్లు, కుర్చీలు అందించారు. ఈ సందర్భంగా ఎంఈవో ప్రధానోపాధ్యాయులు సందీప్‌ను, వారి మిత్రులను అభినందించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షులు ఎర్ర పూర్ణచందర్, జనరల్ సెక్రటరీ కొండ సంజీవ యాదవ్, సీఆర్పీ శేషకుమార్, ఉపాధ్యాయురాలు స్వప్న పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శి మృతి


వెంకట్రామ్ (ఫైల్)

నర్సింహులపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జయపురం గ్రామంలో విధులు నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... వరంగల్ జిల్లాలోని నెక్కొండ మండల కేంద్రానికి చెందిన కొర్ర వెంకట్రామ్ (55) సోమవారం ఉదయం విధులకు హాజరై, మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మీటింగ్‌కు హాజరయ్యాడు. మీటింగ్ పూర్తయిన అనంతరం బైక్‌పై నెక్కొండకు బయలుదేరాడు. ఈ క్రమంలో నెక్కొండ మండలంలోని రెడ్లవాడ గ్రామ సమీపంలోని రాంకీ తండా వద్ద ఎదురుగా బైక్ వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

నర్సింహులపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పిచ్చిరాం తండాకు చెందిన వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిలాలోని తిరుమలాయపాలెం ఇస్లావత్ తండాకు చెందిన సంగీత(30)కు పిచ్చిరాం తండాకు చెందిన భూక్య రాముతో 2014లో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ నెల 8న భార్యాభర్తల మధ్య గొడవ జరగగా మనస్తాపానికి గురై ఎలుకల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి ఇస్లావత్ గణపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మరిపెడ హైస్కూల్ విద్యార్థులకు బుక్స్ పంపిణీ

మరిపెడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ హైస్కూల్ విద్యార్థులకు సోమవారం స్ఫూర్తి ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు ఎన్ఎంఎంఎస్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణయ్య మాట్లాడుతూ ఎన్ఎంఎంఎస్ పరీక్ష ద్వారా ఎంపికైన 8వ తరగతి చదివే విద్యార్థులకు నాలుగేళ్ల పాటు సంవత్సరానికి రూ.12వేల చొప్పున స్కాలర్‌షిప్‌ను కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని ఈ పథకం విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ స్కూల్ హెచ్ఎం అనంతరావు, మరిపెడ మాజీ కౌన్సిలర్ ఎడెల్లి పరుశరాములు, స్కూల్ టీచర్లు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో స్టూడెంట్ కౌన్సిల్ ఏర్పాటు

మరిపెడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ మోడల్ స్కూల్‌లో సోమవారం ఆ స్కూల్ నిర్వాహకులు స్టూడెంట్ కౌన్సిల్ ఏర్పాటు చేశారు. హెడ్ బాయ్, హెడ్ గర్ల్ నియామకంతో పాటు అబ్దుల్ కలాం, ఠాగూర్, శంకుతలాదేవి, రామన్ పేర్లతో ప్రత్యేక హౌస్‌లను ఏర్పాటు చేశారు. క్యాప్టెన్, వైస్ క్యాప్టెన్‌ను విద్యార్థులు ఎన్నుకున్నారు. ఈసీ క్లబ్, డిజిటల్, స్పోర్ట్స్, కల్చరల్, ప్రహరీ, గర్ల్‌చైల్డ్ క్లబ్‌లను ఏర్పాటు చేసి వాటికి సెక్రటరీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సత్తార్‌పాషా మాట్లాడుతూ విద్యార్థులకు పోటీతత్వం పెంపొందిచాడానికి వీటిని ఏర్పాటు చేశామన్నారు. ఎంపికైన విద్యార్థులకు విధులు, బాధ్యతలపై ప్రిన్సిపాల్ అవగాహన కలిపించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

● పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి


కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పెద్దవంగర, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదిక వివిధ గ్రామాలకు చెందిన 32మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి రూ.32,03,712లు, 14 మందికి రూ.5.36లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి ఒక్కరి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో పాలకుర్తి నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుకుందామని ఎమ్మెల్యే తెలిపారు. గడిచిన 18నెలలో ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలకు అభివృద్ధి, అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిమని తెలిపారు. గ్రామాల సమాగ్రాభివృద్ధే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి ప్రత్యేక చొరవ చూసిస్తోందన్నారు. ప్రతీ గ్రామంలో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ప్రతీ పేద వాడికి సొంతింటి కల నెరవేర్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం ప్రజలంతా స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని, అప్పుడే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తామని తెలిపారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సర్కారుపై ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని వాటిని తిప్పికొట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు తెలియ జేయాలన్నారు. మండల స్థాయి, గ్రామస్థాయి నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వేణుమాధవ్, ఏవో గుగులోతు స్వామినాయక్, ఆర్ఐ లష్కర్, మండల అధ్యక్షులు ముద్దసాని సురేష్, రంగు మురళిగౌడ్, విజయపాల్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, ముత్తినేని శ్రీనివాస్, వెంకన్న, రవి, ఉపేందర్, లింగమూర్తి, జానీ, హరికృష్ణ, సైదులు, సోమన్న, నరేష్, మల్లికార్జునచారి, యాకయ్య, సంపత్, వినోద్, రామ్‌చరణ్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల రొక్కం పెంచాలి


తొర్రూరు తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న వీహెచ్‌పీఎస్ నాయకులు

మరిపెడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆసరా, దివ్యాంగుల పింఛన్ల రొక్కం పెంచాలని సోమవారం ఎంఆర్‌పీఎస్, వీహెచ్‌పీఎస్, దివ్యాంగుల సంఘాల బాధ్యులు మరిపెడ తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ఆసరా పింఛన్లు రూ.2వేల నుంచి రూ 4వేలకు, దివ్యాంగుల పింఛన్లు రూ.4వేల నుంచి రూ 6వేలకు పెంచాలని ఆయా సంఘాల బాధ్యులు డిమాండ్ చేశారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ ఆందోళనలో ఆయా సంఘాల నాయకులు బానోత్ శివ, గౌని యాదగిరి, బోడా ధర్మ, ఇరుగు రవి, తప్పెట్ల విజయ్, గట్టిగుండ్ల బుజంగం, శ్రీనివాస్, కవిత, లాలు, బిచ్చు తదితరులు పాల్గొన్నారు.

● తొర్రూరు (ఆంధ్రజ్యోతి): వికలాంగులకు, వృద్ధులకు పెన్షన్‌లు పెంచాలని కోరుతూ వికలాంగుల పెన్షన్ దారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు జెల్ల ఉపేందర్, వెంకటరమణ మాట్లాడారు. అక్కడికి వచ్చిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంద యాకమల్లు, విష్ణు, సుమన్, రేణుక, రమ, సుశీల తదితరులు ఉన్నారు.

● పెద్దవంగర (ఆంధ్రజ్యోతి) : పెన్షన్‌దారులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఎంఆర్పీఎస్ మండల ఇన్‌చార్జి ఈదురు సైదులు అన్నారు. సోమవారం పెన్షన్ దారుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో పెన్షన్‌దారులు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి తహసీల్దార్ మహేందర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉమా, స్వాతి, ముత్తయ్య, మల్లయ్య, వెంకటయ్య, శ్రీను, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ యూరియా అందేలా చర్యలు

చిన్నగూడూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆందోళన చెందొద్దని, అందరికీ యూరియా అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ సంపత్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి భాస్కర్ తెలిపారు. జయ్యారం పీఏసీఎస్ కేంద్రం వద్ద సోమవారం అధికారులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. అధికారులు సమన్వయంతో పారదర్శకంగా రైతులకు యూరియా బస్తాలు అందేలా అన్ని సౌకర్యాలు కల్పించామని అన్నారు. రైతు వివరాలు సేకరించి, రిజిష్టర్‌లో నమోదు చేసి రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఎప్పటికప్పుడు యూరియా తెప్పించి సరఫరా చేస్తున్నట్లు వివరించారు. నిత్యం యూరియా పంపిణీలో మండల అధికారులు క్షేత్రస్థాయిలో విధుల్లో ఉంటూ రైతులకు సహాయ సహకారులు అందిస్తున్నారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కిన్నెర యాకయ్య, ఎస్సై ప్రవీణ్, ఏఈవో సరిత, కార్యదర్శులు, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ విలీన దినోత్సవాన్ని ప్రభుత్వమే నిర్వహించాలి

మరిపెడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంతోనే హైదరాబాద్ సంస్థానం సెప్టెంబరు 17న భారతదేశంలో విలీనమైందని ఆ రోజును తెలంగాణ విలీన దినోత్సవంగా గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా వేడుకలను అట్టహాసంగా జరపాలని మరిపెడ ఆత్మ చైర్మన్, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ నల్లు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మరిపెడ మునిసిపల్ కేంద్రంలో సీపీఐ శ్రేణులు నిర్వహించిన తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల దినోత్సవం జరపగా ఆయన పాల్గొని అమరుల ఫ్లెక్సీకి పూల మాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడారు. రావి నారాయణరెడ్డి, ముగ్దుం మొయినుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మల చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మరిపెడ మండల బాధ్యులు మారగాని బాలకృష్ణ, యాకన్న, రాములు, వెంకన్న, పాక నరేశ్, సోమయ్య, మంగీలాల్, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణానికి తాళం



తాళం వేసి ఉన్న క్రీడా ప్రాంగణం

తొర్రూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారుల కోసం గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలకు పూర్తి స్థాయిలో స్థలాలు లేకపోవడంతో అందుబాటులో ఉన్నదగ్గర ఏర్పాటు చేశారు. తొర్రూరు పట్టణంలోని రెండవ వార్డు పరిధిలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేయగా పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణ గత కొన్ని రోజులుగా క్రీడా ప్రాంగణం గేటుకు పాఠశాల మెయిన్ రోడ్డుపై ఉన్న మరో గేటుకు తాళం వేసుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడని పలువురు క్రీడాకారులు ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణంలో ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయులు ఏర్పాటుచేసుకున్న వాలీబాల్ టీమ్ సభ్యులు గేటు తాళాలు తీసుకుని క్రీడలు నిర్వహించుకుంటున్నారని, పాఠశాల విద్యార్థులకు, వాకర్స్‌కు తాళాలు వేయడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, క్రీడా ప్రాంగణాలకు తాళాలు తీసి ఉంచాలని పలువురు క్రీడాకారులు కోరుతున్నారు. దీనిపై సంబంధిత ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు.

చెరువు కట్ట మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలి


ఎమ్మెల్యే మురళీనాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న పీఏసీఎస్ మాజీ చైర్మన్ రాంరెడ్డి, కమలాకర్

చిన్నగూడూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గత సంవత్సరం భారీ వర్షాలకు కెవుల తండా సమీపంలోని చౌటకుంట చెరువు వద్ద గొలుసుకట్టు కాలువ పూర్తిగా ధ్వంసమైంది. దానికి అనుసంధానమైన చిన్నగూడూరు ముత్యాలమ్మ, తుమ్మిడి చెరువులకు నీరు చేరడం సంకటమమైందని, తక్షణమే స్పందించి రైతులకు ఇబ్బందులు కలుగకుండా మరమ్మతులకు నిధులు మంజూరు చేసి, పనులు ప్రారంభించాలని సోమవారం మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీ నాయక్‌కు మరిపెడ మాజీ పీఏసీఎస్ చైర్మన్ రావుల రాంరెడ్డి, డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కమలాకర్ వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే రూ.2కోట్లకు రీఎస్టిమేషన్ సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. వారంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌ను కలిసి పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లుగా రాంరెడ్డి తెలిపారు.

గ్రామాల పీహెచ్‌సీ పరిధిని మార్చాలి


జిల్లా వైద్యాధికారికి వినతిపత్రం ఇస్తున్న అంబటి మహేందర్‌రెడ్డి

కేసముద్రం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహమూద్‌పట్నం, కల్వల, తౌర్య, భూక్యరాం, సప్పిడిగుట్ట తండాలు, మునిసిపాలిటీలోని అమినాపురం గ్రామం ఇనుగుర్తి పీహెచ్‌సీ పరిధిలో ఉన్నాయని, వీటిని కేసముద్రానికి మార్చాలని కోరుతూ మహబూబాబాద్‌లో జిల్లా వైద్యాధికారి రవిరాథోడ్‌కు సోమవారం డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి వినతిపత్రాన్ని అందజేశారు. వీటితోపాటు నారాయణపురం, పీక్లా, క్యాంపు తండాలు కూడా నెల్లికుదురు పీహెచ్‌సీ పరిధిలో ఉన్నాయని, దీనివల్ల ప్రజలు ఆస్పత్రి వైద్యసేవలు పొందాలంటే వ్యయ ప్రయాసలకు గురవుతున్నారని తెలిపారు.

వివాదాస్పదంగా మారిన సిబ్బంది నియామకం

● జీడీసీలో బోధనేతర సిబ్బంది ఎంపికపై ఫిర్యాదు



కేసముద్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాల

కేసముద్రం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పాటైన కేసముద్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోధనేతర సిబ్బంది నియామకం వివాదాస్పదంగా మారుతోంది. ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రతిష్ఠాత్మకంగా ఇక్కడ డిగ్రీ కళాశాల ప్రారంభమైన విషయం విదితమే. ఈ కళాశాలను తాత్కాలికంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనంలో నిర్వహిస్తున్నారు. ఈ కళాశాలలో రెండు నెలల క్రితమే ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ విధానంలో బోధనేతర సిబ్బంది నియామకానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కళాశాలలో ఈ ఏడాది 1, ఏప్రిల్ నుంచి వచ్చే ఏడాది 31, మార్చి వరకు కొనసాగేందుకు ముగ్గురు రికార్డు అసిస్టెంట్లు/ల్యాబ్ అసిస్టెంట్లు, ఇద్దరు ఆఫీస్ సబార్డినేట్లు, ఒక సెక్యూరిటీ గార్డు పోస్టులకు రూ.15,600 చొప్పున వేతనాలు చెల్లించాలని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ పోస్టుల నియామకాన్ని ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీకి ప్రభుత్వం అప్పగించింది. ఇందుకోసం సదరు ఏజెన్సీ వారు స్థానికులకు తెలిసే విధంగా పత్రికల్లో ప్రకటనలు, సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తూ నోటిఫికేషన్ విడుదల చేయాలి. ఈ నోటిఫికేషన్‌లో ఏ పోస్టులు ఎన్ని ఉన్నాయి? వాటి అర్హతలు, నియామక నిబంధనలను పేర్కొనాలి. అయితే అలాంటి ప్రచారమేమీ లేకుండా ఈ పోస్టుల్లో ఆరుగురిని కొద్దిరోజుల క్రితమే నియమించారని స్థానిక నిరుద్యోగులు ఆరోపిస్తున్నారు. తమకు తెలియకుండా గుట్టుచప్పుడు కాకుండా ఈ నియామకాలు చేపట్టి తమకు అన్యాయం చేస్తున్నారని పలువురు నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు సైతం చేశారు. ఇప్పటికైనా స్థానికులను నియమించాలని పలువురు నిరుద్యోగులు కోరుతున్నారు.

స్థానికులకు అవకాశం ఇవ్వాలి

- ఎండీ.తాజొద్దీన్, కేసముద్రం స్టేషన్



కేసముద్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఔట్‌సోర్సింగ్ పోస్టుల్లో స్థానికులైన నిరుద్యోగులకు అవకాశం ఇవ్వాలి. గుట్టుచప్పుడు కాకుండా నిబంధనలను పాటించకుండా ఆరుగురిని నియమించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశా. వెంటనే సదరు నియామకాలను రద్దు చేసి అర్హులైన స్థానికులతో భర్తీ చేయాలి.

ప్రభుత్వంపై ఆరోపణలు మానుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కురవి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అసత్య ఆరోపణలు మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ కురవి మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రం, మహబూబాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్‌నాయక్ అన్నారు. కురవిలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి యూరియా అందించకపోయినా.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వ మెడలు వంచి రైతాంగానికి కావాల్సిన యూరియాను తీసుకువచ్చారని చెప్పారు. గత 15 రోజులుగా నిరంతరాయంగా రైతాంగానికి యూరియాను ప్రభుత్వం అందిస్తుందని, అన్నిశాఖల అధికారులు రైతుసేవలో నిమగ్నమయ్యారని పేర్కొన్నారు. మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ కురవి మండలం పెద్దతండాలో క్యూలైన్‌లో నిలబడినప్పటికి కూపన్ తప్ప యూరియా ఇవ్వలేదని ఆరోపించడం అసత్యమన్నారు. సత్యవతిరాథోడ్ పేరిట 10 యూరియా బస్తాలను సంబంధిత అధికారులు ఇచ్చారని వెల్లడించారు. యూరియా తీసుకుని ఇలా కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా చౌకబారు ప్రకటనలు మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో గుండ్రాతిమడుగు సొసైటీ చైర్మన్ గార్లపాటి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గొల్లపల్లి రజినీకాంత్, బండి లక్ష్మారెడ్డి, అంబటి వెంకటనారాయణ, ఎన్.రాజేందర్‌కుమార్, దారావత్ చందులాల్, చిన్నం గణేష్, కామిండ్ల వీరన్న, కాసాని అనిల్ పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశాల గడువు పొడిగింపు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ప్రవేశాల గడువును ఈనెల 26వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్, సమన్వయ కర్త హతిరామ్ తెలిపారు. మహబూబాబాద్‌లోని నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓపెన్ డిగ్రీలో ప్రవేశాల వాల్ పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 2025-26 విద్యా సంవత్సరంకు గాను ఓపెన్ డిగ్రీ ప్రథమ సంవత్సరంలో బీఏ, బీకాం, బీఎస్సీలో ప్రవేశం పొందడానికి ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల 26వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. ఆదివాసీలైన గోండు, కోయ, చెంచు తదితర తెగల వారు ట్యూషన్ ఫీజు లేకుండా నామమాత్రపు అడ్మిషన్ ఫీజు రూ.500తో ప్రవేశం పొందవచ్చన్నారు. ఇంటర్ ఓపెన్, స్కూల్ సొసైటీ, పాలిటెక్నిక్, ఐటీఐలలో చదవిన వారు డిగ్రీలో చేరేందుకు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకొని కళాశాలలో ధృవ పత్రాలను అందజేయాలన్నారు. ఇతర వివరాలకు సెల్ నెంబర్ : 73829 29705ను సంప్రదించాలన్నారు.

వాల్యూ ఎడ్యుకేషన్‌పై అవగాహన కల్పించాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు విలువ విద్య(వాల్యూ ఎడ్యుకేషన్)ను బోధించాలని పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి యోగితారాణా సూచించారు. హైదరాబాద్ నుంచి సోమవారం టీ షాట్ విద్యా చానల్ ద్వారా ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా యోగితారాణా మాట్లాడుతూ.. నైతిక విలువలను పెంపొందించి క్రమశిక్షణ, మానవత్వం, వ్యక్తిత్వం, సృజనాత్మకత, బాధ్యతలను పెంచి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు టీ-షాట్ విద్యా చానల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం(ఫోన్ ఇన్ లైవ్) చేపడుతున్నట్లు తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యార్థులకు, మధ్యాహ్నం 2.30 నుంచి 3.30 గంటల వరకు ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు వీక్షించారు.

పాలకులపై తిరుగుబాటు తప్పదు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.నాగయ్య


కేసముద్రంలో మాట్లాడుతున్న జి.నాగయ్య

కేసముద్రం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. కేసముద్రంలో సోమవారం పార్టీ మండల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. అమెరికా నుంచి పత్తి దిగుమతులపై 11శాతం సుంకాలు తగ్గించడంతో ఇక్కడి రైతులకు పత్తి మద్దతు ధర అందకుండా పోతుందని, వ్యవసాయ రంగం సంక్షోభంలో పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు ఉపాధి లభించక పోరాటంలోకి వస్తారని తెలిపారు. సమావేశంలో పార్టీ మండల నిర్మాణ బాధ్యుడు ఆకుల రాజు, జిల్లా కమిటీ సభ్యుడు మార్తినేని పాపారావు, మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న, నీరుటి జలేందర్, తాడబోయిన శ్రీశైలం, జల్లె జయరాజ్, కావటి నర్సయ్య, ఆల్వాగొండ సావిత్రి, జాటోత్ వెంకన్న, సోమారపు ఎల్లయ్య, చందా వెంకన్న, గుగులోత్ కేశ్య పాల్గొన్నారు.

ఉద్యమకారులపై అక్రమ కేసులను ఎత్తివేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష నేతలు

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై పోరాడిన ఉద్యమకారులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు బి.విజయసారథిరెడ్డి, సాదుల శ్రీనివాస్, న్యూడెమోక్రసీ నేతలు మండల వెంకన్న, గౌని ఐలయ్య డిమాండ్ చేశారు. రైతులకు అన్యాయం చేసే నల్ల చట్టాలు రద్దు చేయాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని ఉద్యమం చేయగా నాటి ప్రభుత్వం పెట్టిన కేసులో వామపక్ష పార్టీల నేతలు మానుకోట జిల్లా కోర్టుకు సోమవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... నల్ల చట్టాలు రద్దు చేయాలని ఉద్యమించగా కేంద్రం దిగివచ్చి వాటిని రద్దు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా ఆర్టీసీ విలీన ఉద్యమం దాదాపు 50 రోజులు చేపట్టిందన్నారు. గత ప్రభుత్వం వామపక్ష నేతలపై అక్రమంగా పెట్టిన కేసులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి.అజయ్‌సారథిరెడ్డి, నల్లు సుధాకర్‌రెడ్డి, తమ్మెర విశ్వేశ్వరరావు, ఆకుల రాజు, హలావత్ లింగ్యానాయక్, జగ్గన్న, పెరుగు కుమార్, నవీన్, వెంకన్న, శేఖర్, శ్రావణ్, వీరన్న, రాజు, దేవేందర్, ఉపేందర్, నాగయ్య, రాజమౌళి, మాధవి, పద్మ, శ్రీలత, పాపయ్య, హేమానాయక్ పాల్గొన్నారు.

సామాన్యులే.. సాయుధులై..

- పోరులో రక్తమోడిన తమ్మడపల్లి(జి)
- 12 మందిని కాల్చి చంపిన నిజాం సేనలు
- ఎదురొడ్డి పోరు నడిపిన అచ్చమాంబ
- అమరులను స్మరించుకుంటున్న పోరుగడ్డ
- 17న తెలంగాణ విమోచన దినోత్సవం



తమ్మడపల్లి(జి)లోని అమరుల స్మారక స్థూపం

జఫర్‌గడ్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ సంస్థానాన్ని నిజాం నిరంకుశ పాలకుల నుంచి విముక్తి చేసేందుకు, భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం సామాన్యులే సాయుధులై.. సారథులుగా మారిన తెలంగాణ విమోచనోద్యమంలో వీరుల త్యాగాలు వెలకట్టలేనివి. జనగామ జిల్లాలో పాలకుర్తికి చెందిన చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం భూ పోరాటానికి నాంది పలకగా.. దొడ్డి కొమురయ్య ఆత్మార్పణతో సాయుధ పోరాటంగా మారింది. ఆయన బలిదానం తెలంగాణలో ప్రజా వెల్లువను సృష్టించింది. 'నీ బాంచెన్.. కాల్మొక్తా' అంటూ జోడించిన చేతులు బందూకులు పట్టాయి. దశాబ్దాల దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సామాన్యులే సాయుధులై జరిపిన పోరాటమే.. నాటి తెలంగాణ సాయుధ పోరాటం.

జఫర్‌గడ్‌లో పోరాట క్రమం..

తెలంగాణ సాయుధ పోరులో భాగంగా జఫర్‌గడ్ ప్రాంతంలో నైజాం, రజాకార్లు, భూస్వాముల అణచివేత, నిర్బంధకాండకు వ్యతిరేకంగా ప్రజలు, రైతులు ఉద్యమించారు. జఫర్‌గడ్‌ను కేంద్రంగా చేసుకుని పాలిస్తున్న నైజాం పాలకుల అనుచరుడైన రజాకార్ల నాయకుడు పాల్పడుతున్న ఖాదరెల్లి వేధింపులు, దౌర్జన్యాలను అరికట్టేందుకు, రజాకార్లు, జాగీర్‌దారుల ఆగడాలను ప్రజలు రక్షక దళాలను ఏర్పరచుకుని చేతికందిన రాళ్లు, కర్రలు, వడిసెలు, బరిసెలు, కత్తులు వంటి సంప్రదాయ ఆయుధాలతో ఎదుర్కొని పోరాడారు. కమ్యూనిస్టు దళ నేతలు నల్ల నర్సింహులు, కృష్ణమూర్తి, యాదగిరిరావు, కూనూరు నెల్లుట్ల మోహన్‌రావు, పెండ్యాల రాఘవరావు, పంబాల రాఘవరావు, ఎలమంద తదితరులు సంచరిస్తూ రక్షక దళాలు, ప్రజలు, రైతులను చైతన్యపరిచేవారు.

12 మందిని కాల్చి చంపిన పోలీసులు...

సాయుధ పోరులో భాగంగా 1947, సెప్టెంబరు 11న జరిగిన ఆంధ్ర మహాసభ తీర్మానాన్ని స్ఫూర్తిగా తీసుకుని జఫర్‌గడ్ ప్రాంతంలో నిర్బంధకాండను సాగిస్తున్న రజాకార్ల నాయకుడు ఖాదరెల్లి ఆగడాలకు వ్యతిరేకంగా పలు గ్రామాల ప్రజలు, రైతులు తిరగబడి నిజాం, రజాకార్ల ప్రతినిధులను తరిమేశారు. దీంతో ఆగ్రహించిన ఖాదరెల్లి పోలీసులు, అనుచరులతో ప్రజలపై దాడులు చేయించాడు. ఈ దాడుల క్రమంలో తిరగబడుతున్న పోరాట యోధులను హతమార్చేందుకు 1948, సెప్టెంబరులో నిజాం, రజాకార్ల పోలీసు మూకలు మండలంలోని తమ్మడపల్లి(జి) గ్రామాన్ని చుట్టుముట్టి.. గ్రామానికి చెందిన 12మందిని నిర్బంధించి గ్రామ సెంటర్‌లో నిలబెట్టి వారిపై నిర్దాక్షిణ్యంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో చాడ అనంతరెడ్డి, బత్తిని బక్కరాజయ్య, దొంతూరి చినమల్లయ్య, ఎరుకలి ఇద్దయ్య, గుండెమల్ల పోశాలు, చెదలు నర్సయ్య, ఎండి.ఖాసీం, గుజ్జరి రామయ్య, దిడ్డి పెరుమయ్య, దుద్యాల చిన్ననర్సయ్య, గంద్రకుంట కోమటి నర్సింహరామయ్య, కుంట పెద్దాపురంలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో 8 మంది గాయాలతో ప్రాణాలు దక్కించుకున్నారు. ఈ ఘటనపై ప్రజలు ఆగ్రహావేశాలతో జఫర్‌గడ్‌లోని రజాకార్ల నేత ఖాదరెల్లి బంగ్లాపై దాడి చేసి, అతడి పశువుల కొట్టం, మొక్కజొన్న గూళ్లను దహనం చేశారు. పశువులను గ్రామాల్లో ప్రజలకు పంపిణీ చేశారు. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా నాటి పోరాట క్రమాన్ని ప్రజలు చర్చించుకుంటూ జ్ఞాపకాలను నెమరువేసుకుంటున్నారు.

ఆయుధం పట్టిన అచ్చమాంబ ..

జిల్లాలోని జఫర్‌గడ్ మండలం కూనూరుకు చెందిన నెల్లుట్ల సుశీలాదేవి అచ్చమాంబ పేరుతో భర్త నెల్లుట్ల మోహన్‌రావుతో కలిసి నాటి తెలంగాణ సాయుధ పోరాటంలో ఆయుధం పట్టింది. ప్రత్యక్షంగా పాల్గొని నిజాం, రజాకార్లు, భూస్వాముల ఆగడాలు, దుశ్చర్యలకు వ్యతిరేకంగా మహిళలు, ప్రజలను చైతన్యవంతం చేస్తూ పోరాటం సాగించారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం గొల్లచర్ల గ్రామానికి చెందిన అచ్చమాంబ 14 ఏళ్ల వయసులోనే నైజాం, రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న క్రమంగా ఉద్యమంలో కూనూరుకు చెందిన దళ నేత నెల్లుట్ల మోహన్‌రావుతో పరిచయం ఏర్పడడంతో వారిద్దరూ వివాహం చేసుకున్నారు. పోరాటంలో గాయపడిన కార్యకర్తలకు వైద్యం చేస్తూ.. మరోవైపు ఆమె మహిళలను చైతన్యవంతం చేస్తూ దళనాయకులతో కలిసి ఆయా ప్రాంతాల్లో సంప్రదాయ ఆయుధాలతో సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకం. భర్త చనిపోగా సుశీలాదేవి ప్రస్తుతం హనుమకొండలో కుమార్తె వద్ద ఉంటోంది.



సాయుధ పోరాటంలో పాల్గొన్న కూనూరుకు చెందిన నెల్లుట్ల సుశీలాదేవి (ఫైల్)

రెచ్చిపోతున్న రౌడీ షీటర్లు

- దందాలు, సెటిల్‌మెంట్లలో బిజీబిజీ
- మాట వినకపోతే భౌతికదాడులు
- పోలీసుల కౌన్సెలింగ్‌కు సైతం దూరం
- ఖాకీలకు సవాల్‌గా మారిన గ్యాంగులు



మట్టెవాడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పగలంతా జులాయిగా తిరగడం.. రాత్రయిందంటే మద్యం సేవించి గొడవలు సృష్టించడం నగరంలో సర్వసాధారణం అయిపోయాయి. గతంలో రౌడీల ఆగడాలు కొంత మేరకు తగ్గినా పోలీసుల నిఘా కొరవడడంతో ఇటీవల మళ్లీ ఎక్కువయ్యాయి. వరంగల్ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని మూడు పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీలు రెచ్చి పోతున్నారు. రాజకీయ నాయకుల అండదండలతో భూ దందాలు, సెటిల్‌మెంట్లు చేస్తున్నారు. మాట వినకపోతే భౌతిక దాడులకు పాల్పడుతున్నారు. పోలీసులు నెలవారీగా నిర్వహిస్తున్న కౌన్సెలింగ్‌లకు సైతం కొంత కాలంగా రౌడీ షీటర్లు హాజరుకావడం లేదు. ఇటీవల గణపతి నిమజ్జనం రోజున కరీమాబాద్ ప్రాంతంలో ఒక రౌడీ షీటర్ తన గ్యాంగుతో వచ్చి గణేశ్ మండప నిర్వాహకులపై దాడికి పాల్పడ్డారు. ఈ నెల 7వ తేదీన మండిబజార్‌లోని ఒక హోటల్ వద్ద ఇద్దరు యువకులతో గొడవ పడి బీరు బాటిల్‌తో దాడికి పాల్పడ్డారు. సదరు రౌడీ షీటర్‌పై మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో, మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కాని ఇప్పటివరకు పోలీసులు అతడిని అరెస్టు చేయలేదు. రౌడీ షీటర్లను కట్టడి చేయడంలో పోలీసులు విఫలమవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి.

దాడులు, సెటిల్‌మెంట్లు..

నగరంలోని రౌడీ షీటర్లు ల్యాండ్ సెటిల్‌మెంట్లలో బీజీగా ఉంటున్నారు. కొంత మంది రియల్టర్లు, రాజకీయ నేతల అండతో భూ కబ్జాలకు పాల్పడుతున్నారు. రాత్రికి రాత్రే పట్టా భూముల్లో పాగా వేస్తున్నారు. యాజమానులను రౌడీలతో బెదిరిస్తున్నారు. ఇటీవల వరంగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రైవేట్ గ్యాంగు కాలనీ స్థలాన్ని కబ్జా చేశారు. కాలనీవాసులు అడ్డుకుంటే వారిపైన దాడులకు పాల్పడ్డారు. ఈ విషయంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని చేతులు దులుపుకున్నారు. సివిల్ కేసు అని చెప్పి వెనక్కి పంపిస్తున్నారు. ఎదోలా సెటిల్‌మెంట్లు చేసుకోవాలని ఉచిత సలహా ఇస్తున్నారు.

కౌన్సెలింగ్‌కు రౌడీ షీటర్లు దూరం..

పోలీసులు నెలవారీగా నిర్వహిస్తున్న కౌన్సెలింగ్‌లకు చాలా మంది రౌడీ షీటర్లు హాజరుకావడం లేదు. కొంత మంది రాజకీయ నేతలతో ఫోన్లు చేయించుకుంటున్నారు. ఇటీవల వరంగల్ సబ్ డివిజన్ పరిధిలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు చాలా మంది రౌడీ షీటర్లు హాజరు కాలేదు. పోలీసులకు తెలియకుండా కొంతమంది రౌడీలు గొడవలు సృష్టిస్తున్నా పోలీసులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

అర్ధరాత్రి వరకు హోటళ్లు.. బార్లు..

వరంగల్ ప్రాంతంలో అర్ధరాత్రి వరకు యథేచ్ఛగా బిర్యానీ సెంటర్లు, బార్లు, బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారు. పోలీసులు నామమంత్రంగా పెట్రోలింగ్ నిర్వహిస్తుండంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వరంగల్ మండిబజార్, ఎల్బీనగర్, నిజాంపుర, చౌర్‌బౌళి ప్రాంతంలో అర్ధరాత్రి వరకు టిఫిన్ సెంటర్లు, హోటళ్లు తెరిచి ఉండడంతో తరచూ మద్యం సేవించిన వాళ్లు గొడవలు సృష్టిస్తున్నారు.

రౌడీ షీటర్లపై నిఘా ఏది..


వరంగల్ మట్టెవాడ, ఇంతేజార్‌గంజ్, మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ల పరిధిలో కొంతమంది రౌడీషీటర్లు తరుచుగా గొడవలకు పాల్పడున్నా పోలీసులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వస్తున్నాయి. మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో 19 మంది రౌడీషీటర్లు ఉండగా డీసీ, కేడీ, సస్పెక్టు కేసుల్లో మరో 50 మంది ఉన్నారు. ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 16 మంది రౌడీషీటర్లు, డీసీ, కేడీ, సస్పెక్టు షీట్‌లో మరో 87 మంది ఉన్నారు. మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌పరిధిలో 74 మంది రౌడీ షీటర్లు ఉన్నారు. సస్పెక్టు షీట్, డీసీ, కేడీ షీట్‌లో మరో 166 మంది ఉన్నారు. పోలీసుల నిఘా పూర్తిస్థాయిలో లేకపోవడంలో వారు తరచుగా గొడవల్లో తలదూరుస్తున్నారు.

రౌడీ షీటర్లతో పోలీసుల దోస్తానా..

వరంగల్ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో కొంతమంది రౌడీషీ టర్లతో కొందరు పోలీసులు ఫ్రెండ్‌షిప్ చేస్తున్నారని, వారితో కలిసి పార్టీలు చేసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా ఖిలావరంగల్, కరీమాబాద్, ఉర్సుగుట్ట, హంటర్‌రోడ్డు, రంగంపేట, రామన్నపేట, కొత్తవాడ, దేశాయిపేట, కాశిబుగ్గ, ఎల్బీనగర్ తదితర ప్రాంతాల్లో ఎక్కువగా రెచ్చిపోతూ గొడవల్లో తలదూరుస్తున్నాని నగర ప్రజలు మండిపడుతున్నారు.

రజాకార్ల రాక్షసత్వం

8 మంది తెలంగాణ యోధులు బలి



తెలంగాణ యోధులను రజాకార్లు కాల్చి చంపిన నరహరి తండాలోని గుట్ట

భీమదేవరపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిజాం నిరంకుశ పరిపాలనకు వ్యతిరేకంగా తెలంగాణ యోధులు నడుం బిగించిన రోజులు.. నిజాం రాక్షసత్వానికి చరమగీతం పాడాలని తహతహలాడుతున్న తెలంగాణ యోధులపై రజాకార్లు కక్ష కట్టారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం రాయికల్ పాత పోలీస్‌స్టేషన్‌పై దాడి చేసి తెలంగాణ యోధులు తుపాకులు ఎత్తుకెళ్లారు. దీంతో భీమదేవరపల్లి మండలంపై రజాకార్లు ఎనిమిది మంది తెలంగాణ యోధులపై తుపాకీ గుండ్ల వర్షం కురిపించారు. ముల్కనూర్ గ్రామానికి చెందిన కూన రోశయ్య, ఎర్రబెల్లి గ్రామానికి చెందిన లంబాడ నాగ్య, ముత్తారం గ్రామానికి చెందిన మేకల కొంరయ్య, రేణుకుంట్ల వెంకటయ్య, రాజయ్య, ఎలబోయిన అయిలయ్య, కొడూరి వెంకటయ్యను రజాకార్లు పట్టుకున్నారు. వీరందరిని భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ నరహరి తండా మధ్యలోని వజ్రపు గుండుకు వరుసగా నిలబెట్టి రజాకార్లు తుపాకీ గుండ్ల వర్షం కురిపించారు. 8 మంది తెలంగాణ పోరాట యోధులను ఒకేసారి కాల్చి చంపడం అప్పట్లో పెద్ద సంచలనం సృష్టించింది. తెలంగాణ యోధులు మిలిటెంట్ వ్యవస్థగా ఏర్పడి రజాకార్లతో పోరు సల్పేందుకు ప్రయత్నిస్తున్నారని రజాకార్లు కక్ష కట్టారు. 3 గ్రామాలకు చెందిన ఎనిమిది మంది తెలంగాణ యోధులను పట్టుకచ్చి వజ్రపు గుండుకు కాల్చి చంపడం ఈ ప్రాంతంలో ఇప్పటికీ చర్చనీయాంశంగా మారింది. రజాకార్ల రాక్షసత్వానికి వజ్రపు గుండు నిలువెత్తు సాక్షంగా మారింది.

రోడ్డెక్కిన అంగన్‌వాడీలు

- పీఎంశ్రీ పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్
- మంత్రి సురేఖ ఇంటి ముట్టడికి యత్నం
- మంత్రి హామీతో ఆందోళన విరమణ



రాంనగర్ కొండా సురేఖ ఇంటి ముందు బారికేడ్లు ఏర్పాటు చేసిన పోలీసులు

రాంగనర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పీఎం శ్రీ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం తీసుకురాబోతున్న ప్రీ ప్రైమరీ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం అంగన్‌వాడీలు తలపెట్టిన మంత్రి సురేఖ ఇళ్ల ముట్టడి ఉద్రిక్తతలకు దారి తీసింది. ఉమ్మడి జిల్లాలోని వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్ జిల్లాల నుంచి తరలివస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలను పోలీసులు ఎక్కడికి అక్కడ ముంద స్తు అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్‌లలో నిర్బందించారు. హనుమకొండ రాంనగర్‌లోని మంత్రి నివాసం ఉండే పరిసరాల్లోకి అంగన్‌వాడీలు రాకుండా బారికేడ్లు ఏర్పాట్లు చేసి దారులు మూసివేశారు. అయినా గ్రేటర్ వరంగల్‌లోని అంగన్‌వాడీలు పోలీసుల నిర్బంధాలను, అడ్డగింతలను దాటుకొని మంత్రి నివాసం వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, అంగన్‌వాడీలకు మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుంది. అరెస్టు చేసిన వారందరిని వెంటనే విడుదల చేయాలని భీష్మించుకొని కూర్చోవడంతో నిర్బందించిన వారినంతా వదిలేయడంతో వారంతో సురేఖ ఇంటి వద్దకు చేరుకున్నారు.

ఈ సందర్భంగా సీఐటీయూ అనుబంధ సంఘమైన అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ గౌరవధ్యక్షుడు రాగుల రమేశ్ మాట్లాడుతూ ప్రమాదకరమైన జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకించాల్సిన ప్రభుత్వం భిన్నంగా వ్యవహరిస్తూ ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేయాలని చేస్తుందని మండిపడ్డారు. పీఎం శ్రీవిద్య పథకంలో భాగంగా ఐదు సంతవత్సరాల లోపు పిల్లలను విద్యాశాఖకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకోవడం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకొని ప్రీ ప్రైమరీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు తప్పనిసరిగా చేసిన ఫేస్ క్యాప్చర్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. ఎఫ్ఆర్ఎస్‌కు పోషకహారానికి లింకు పెట్టడం వల్ల చాలా మంది పేదలు నష్టపోతున్నారని తక్షణమే ఈ విధానం రద్దు చేసి 5 జీ నెట్ వర్క్ మొబైల్స్‌ను అందించాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను 13 నెలల కింద ప్రకటించి ఇప్పటి వరకు ఇవ్వకపోవడం సరైన పద్ధతి కాదన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో 18,000 వేతనం, పీ.ఎఫ్ సౌకర్యం కల్పిస్తామని చెప్పి ఇప్పటి వరకు అమలు చేయడం లేదన్నారు. కాగా, స్థానిక సీఐ మేకల రంజిత్‌తో పాటు మంత్రి నివాసంలో అందుబాటులో ఉన్న పీఏతో మంత్రి ఫోన్‌లో మాట్లాడి తాను లోకల్‌లో లేను వరంగల్ రాగానే అంగన్‌వాడీ నాయకులతో ప్రత్యేకంగా సమావేశమై డిమాండ్లను పరిష్కరించేదిశగా కృషి చేస్తానని అంగన్‌వాడీలకు చెప్పాలని తెలపడంతో అదే విషయాన్ని సీఐ, పీఏ అంగన్వాడీలకు చెప్పడంతో 15 సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మంత్రి పీఏకు ఇచ్చి ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, సీఐటీయు జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య, ఉపాధ్యక్షుడు బొట్ల చక్రపాణి, చుంచు విజేందర్, అంగన్వాడీ కార్యకర్తలు వీరగోని నిర్మల, శోభరాణి, రాజేశ్వరీ, రమాదేవి, జమున, హైమావతి, రజిత, అనిత, శారద, షైముదా, అంజుమ్, వందలాది అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉల్లికోడు తెగులు - నివారణ చర్యలు

రైతులకు శాస్త్రవేత్తల సలహాలు

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వానాకాలం వరిలో ఉల్లికోడు తెగులు ఆశిస్తున్నది. దీని నివారణకు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి రీజనల్ అగ్రికల్చర్ రీసెర్చ్ సెంటర్(వరంగల్) ప్రధాన శాస్త్రవేత్త ఎల్.కృష్ణ కొన్ని సూచనలు ఇస్తున్నారు. వానాకాలం సీజన్‌లో ఆలస్యంగా నాటు వేయడం వల్ల ఈ తెగులు ఆశిస్తుందని అంటున్నారు. ఉల్లికోడు లక్షణాలు, నివారణ చర్యల గురించి ఆయన మాటల్లోనే తెలుసుకుందాం..

తెగులు లక్షణాలు..

కీటకాలు వరి ఆకుల కొనల దగ్గర, మువ్వ మట్టలమీద విడివిడిగాను, లేదా గుంపులు గుంపులగాను గుడ్లు పెడుతాయి. వీటి నుంచి పిల్ల పురుగులు బయటకు వచ్చి అంకురం వద్ద చేరి నష్టం చేస్తాయి. అంకురం లేతాకుపచ్చ లేదా ఆకుపచ్చని పొడవాటి గొట్టంగా మార్పు చెంది బయటకు వస్తుంది. వీటిని గొట్టాలు, రాగి గొట్టాలు, ఉల్లి గొట్టాలని పిలుస్తారు. ఈ పురుగు ఆశించిన పిలక నుంచి ఎలాంటి కంకులు ఏర్పడవు. పక్క పిలుకలు ఎక్కువగా వస్తాయి.



నివారణ చర్యలు

సిఫారసు చేసిన సమయం లోపల నాట్లు పూర్తి చేయాలి. డబ్ల్యూజీఎల్ -1119 లాంటి తట్టుకునే రకాలను సాగు చేయాలి. పొలం గట్లపై కలుపులేకుండా చూసుకోవాలి. నాటిన 10-15 రోజులలో ఎకరానికి 10కిలోల కార్బొఫ్యూరాన్ 3 సీజీ గులికలు బురుద పదునులో చల్లాలి. లేదా ఫిప్రోనిల్ 5 ఎస్‌సీ లీటరు నీటిలో 2.5 మి.మీ నీటి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. ముఖ్యంగా ఆగస్టు చివరి వారంలో నాట్లు వేసిన రైతులు ఎకరానికి 10 కిలోల చొప్పున కార్బొఫ్యూరాన్ 3సీజీ గులికలు చల్లాలి.

22న పత్తి రైతుల సమస్యలపై సదస్సు

రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

గిర్మాజిపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చే లక్ష్యంతో ఈనెల 22న ఉమ్మడి వరంగల్ జిల్లా పత్తి రైతుల సదస్సు నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ తెలిపారు. వరంగల్ అబ్బనికుంటలో గల తెలంగాణ రైతు భవనంలో సోమవారం రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ ఉపాధ్యక్షుడు ఉరటి అంశాల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో సోమిడి శ్రీనివాస్ మాట్లాడుతూ.. పత్తి దిగుమతులపై ప్రస్తుతం ఉన్న 11 శాతం సుంకాన్ని ప్రధాని నరేంద్రమోదీ ఎత్తివేయడంతో దేశంలోని పత్తి రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. 11 సంవత్సరాలుగా మోదీ ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా కార్పొరేట్ వర్గాలకు అనుకూలంగా పనిచేస్తున్నదని ఆరోపించారు. ఆయనకు రైతుల సంక్షేమంపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వ్యవసాయ కమిషన్ ప్రకటించిన ప్రకారం పత్తి క్వింటాకు కనీస మద్దతు ధర రు.12,000/లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అబ్బనికుంటలోని రైతు సంఘం భవనంలో జరిగే సదస్సుకు రిటైర్డ్ జడ్జి జస్టిస్ బి.చంద్రకుమార్, ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ పాల్గొంటారని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పత్తి రైతులు ఈ సదస్సుకు తరలిరావాలని కోరారు. అనంతరం సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కత్తి సుధాకర్, జిల్లా నాయకులు ఎం. పీరయ్య, ఎస్.భిక్షపతి, జె.జనార్దన్‌రెడ్డి, కె. రవీందర్, బి. ఎల్లయ్య పాల్గొన్నారు.

పెద్ద సదువులు బంద్

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పాల్గొన్న అన్ని ప్రైవేటు కాలేజీలు
- రోడ్డెక్కిన డిగ్రీ, పీజీ, ఫార్మసీ, ఇంజనీరింగ్ విద్యార్థులు
- రాస్తారోకోతో అదాలత్ వద్ద ఉద్రిక్తం
- రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్

హనుమకొండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు ఉన్నత విద్యా సంస్థలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రైవేటు ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య పిలుపు మేరకు సోమవారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్నత విద్యా సంస్థలు బంద్ పాటించాయి. మొత్తం 397 డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, ఇతర వృత్తివిద్యా కళాశాలలు బంద్‌లో పాల్గొన్నాయి. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు, వాటిలో పని చేసే అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో రోడ్డెక్కారు. ర్యాలీ, ధర్నాలు నిర్వహించారు. కళాశాలల బంద్ దృష్ట్యా వీటి ఆధ్వర్యంలో నడిచే హాస్టళ్లలోని విద్యార్థులను ఆదివారమే ఖాళీ చేయించారు. బంద్ విరమణ జరిగే వరకు ఎవరూ రావద్దని తెలియచేశారు. హనుమకొండతో పాటు వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో సైతం ప్రైవేటు ఉన్నత విద్యా సంస్థలు బంద్‌లో పాల్గొన్నాయి.

భారీ ర్యాలీ

హనుమకొండ హంటర్ రోడ్డు నుంచి సుబేదారిలోని అదాలత్ సెంటర్ వరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడవద్దని, ఫీజు బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉన్నత విద్యా వ్యవస్థ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని రాసిన ప్లకార్డులను ర్యాలీలో ప్రదర్శించారు. ఈ ర్యాలీకి ప్రైవేటు ఉన్నత విద్యా సంస్థలకు చెందిన యాజమాన్యాలు సంఘీభావం తెలిపాయి. పీజీ, డిగ్రీ కళాశాలల వ్యవస్థాపక అధ్యక్షుడు సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ ర్యాలీలో పాల్గొని మద్దతు ప్రకటించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

ధర్నా, బైఠాయింపు

అదాలత్ సెంటర్ వద్ద విద్యార్థులు రోడ్డుపై బైఠాయించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఆందోళన చేస్తున్న విద్యార్థులను పోలీసులు సుబేదారి పీఎస్‌కు తరలించారు. విద్యార్థులను బలవంతంగా తొలగించడంతో వారికి పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

రీయింబర్స్‌మెంట్ ఎత్తివేసే కుట్ర

హనుమకొండ ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాషబోయిన సంతోష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే ఫీజు బకాయిలు చెల్లించడం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వద్ద విద్యాశాఖ ఉన్నా ఫీజు బకాయిలు విడుదల చేయడకపోవడం ఆయన నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. సీఎం ఫీజు బకాయిల విడుదలపై మాట తప్పారని, గతంలో డిగ్రీ కళాశాలలు రాష్ట్రవ్యాప్తంగా సెమిస్టర్ పరీక్షలు బహిష్కరించడం వల్ల సకాలంలో పరీక్షలు జరగలేదన్నారు. ఫీజు బకాయిలు విడుదల చేస్తామని చెప్తే పరీక్షలు నిర్వహించామని గుర్తు చేశారు. కానీ ఇప్పటికీ ఫీజు బకాయిలు విడుదల కాక డిగ్రీ పూర్తయిన విద్యార్థులు డబ్బులు కట్టి మరీ సర్టిఫికెట్లను తీసుకుంటున్నారన్నారు. ఇప్పుడు ఇంజనీరింగ్ కాలేజీలు సైతం ఈనెల 15 నుంచి ఫీజు బకాయిలు విడుదల చేసే వరకు నిరవధికంగా బంద్ చేస్తామని ప్రకటించాయన్నారు. బంద్ వల్ల విద్యార్థుల చదువులపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరు ప్రణీత్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు కుక్కల కుమార్, వేల్పుల చరణ్, జిల్లా సహాయ కార్యదర్శి బొజ్జు జ్యోతి, జిల్లా సమితి సభ్యులు వినయ్, టీపీడీపీఎంఏ నాయకులు ఆందోళనలో పాల్గొన్నారు.



అదాలత్ వద్ద రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

బంద్ చేసినా స్పందించరా ?

ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సుందర్‌రాజ్ యాదవ్

రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు ఉన్నత విద్యా సంస్థలు బంద్ పాటిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వంలో ఏ మాత్రం చలనం లేదని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ ధ్వజమెత్తారు. కళాశాల బంద్ వల్ల విద్యార్థులకు ఎంతో నష్టం జరుగుతుందన్నారు. విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. ఫీజు బకాయిలు చెల్లించకపోడం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులను ఉన్నత చదువులకు దూరం చేయాలని ప్రభుత్వ కుట్ర పన్నుతున్నదని ఆరోపించారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులకు వేతనాలు చెల్లించేందుకు, సంక్షేమ పథకాలపై కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వానికి పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయడానికి మాత్రం చేతులు రావడం లేదన్నారు.

మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి

● జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



నామాలపాడు ఏకలవ్య గురుకులంలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

బయ్యారం(డోర్నకల్), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు మెనూ ప్రకారం ప్రతిరోజు రుచి, శుచికరమైన పౌష్టికాహారం అందించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. బయ్యారం మండలంలోని నామాలపాడు ఏకలవ్య గురుకుల పాఠశాలను సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలను పెంచే విధంగా ఉపాధ్యాయులు బోధన చేయాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు.

ప్రతీ రైతుకు యూరియా అందిస్తాం



తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతున్న అధికారులు

డోర్నకల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): డోర్నకల్ మండలంలో అర్హులైన ప్రతీ రైతుకు సరిపడా యూరియా అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రత్యేకాధికారి నర్సింహమూర్తి, తహసీల్దార్ ఇమ్మాన్యుయేల్, ఏవో మురళీమోహన్‌లు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మండలంలోని పీఏసీఎస్‌లు, మన గ్రోమోర్ సెంటర్ల ద్వారా ఇప్పటి వరకు 930 టన్నుల యూరియాను అందించినట్లు చెప్పారు. రైతులు అధిక మోతాదులో యూరియా వాడకూడదన్నారు. నానో యూరియా వాడకంతోనూ అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. నానో యూరియా మొదటి దఫా వాడకంలో మొక్కకు పోషకాలు అందిస్తుందని, రెండోసారి వాడిన తర్వాత మంచి ఫలితాలు ఉంటాయని తెలిపారు. మండలంలో రోజుకు సుమారు 30 టన్నులకు పైగా యూరియా పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఇక నుంచి రైతులకు రైతు భరోసా పోర్టల్ ప్రకారం యూరియాను అందించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీఐ చంద్రమౌళి, ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు తక్షణమే మంజూరు చేయాలి



మహబూబాబాద్ నలంద డిగ్రీ కళాశాల ఎదుట మాట్లాడుతున్న ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం జిల్లా కార్యదర్శి డోలి సత్యనారాయణ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):పెండింగ్‌లో ఉన్న ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాల స్కాలర్‌షిప్‌లు వెంటనే మంజూరు చేయాలని ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం జిల్లా కార్యదర్శి డాక్టర్ డోలి సత్యనారాయణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్‌లోని నలంద డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గత 4 సంవత్సరాలుగా స్కాలర్‌షిప్‌లు మంజూరు కాకపోవడంతో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు భవనాల కిరాయిలు చెల్లింలేక ఆర్థికంగా నష్టపోతున్నాయని పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులు విద్యాపరంగా నష్టపోతున్నారని తెలిపారు. గత ప్రభుత్వం రెండేళ్ల బకాయిలు పెండింగ్‌లో ఉంచగా, ప్రస్తుత ప్రభుత్వం కూడా రెండేళ్ల నుంచి స్కాలర్‌షిప్‌ల మంజూరులో అనేక హామీలిచ్చినా అమలు చేయడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం టోకెన్లు విడుదల చేసిన వాటికైనా నిధులు మంజూరు చేయాలన్నారు. లేనిపక్షంలో డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యం నల్లబ్యాడ్జీలు ధరించి ఈ నెల 16 నుంచి కళాశాలల ఎదుట నిరసన తెలుపుతూ విద్యార్థులను కళాశాలలకు రావద్దని సూచించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, అధ్యాపకులు శంకర్, ప్రసాద్, రమేష్, ఉప్పలయ్య, ముత్తయ్య, కృష్ణారావు, హరి, రాజు, శేఖర్, కృష్ణ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి

నెల్లికుదురు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఐ మండల కార్యదర్శి బైస స్వామి తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను పురస్కరించుకొని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం అమరవీరులు బైస కట్టమల్లు, కొండపెల్లి గోపాల్‌రావు, చిర్ర లింగయ్య, చట్ల యాకయ్య, దండెంపెల్లి వెంకటయ్యల స్మారక స్తూపాల వద్ద నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యకర్తలు తూటి వెంకట్‌రెడ్డి, చిర్ర సత్యనారాయణ, వర్రె వెంకన్న, షేక్ సలీమ్, ఉప్పరబోయిన లక్ష్మణ్ పాల్గొన్నారు.

పింఛన్లు పెంచాలని దివ్యాంగుల ధర్నా

ఇనుగుర్తి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పింఛన్లను రూ.6వేలకు పెంచాలని ఇనుగుర్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో దివ్యాంగులు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ తరంగిణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చెడుపాక లక్ష్మణ్, ధీకొండ శ్రీలత, మద్దెల రాములు, రజిత, మల్లయ్య, సోమయ్య, పులమ్మ వెంకన్న పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి : ఎంఈవోలు

కురవి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కురవి, సీరోలు ఎంఈవోలు బాలాజీనాయక్, లచ్చిరాంనాయక్‌లు అన్నారు. కురవి మండలం బలపాలలో సోమవారం ఎస్‌జీఎఫ్‌ఐ అండర్-14,17 ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడల సెలక్షన్స్‌ను ప్రారంభించి మాట్లాడారు. పీఈటీ డి.శ్రీనివాస్, పీడీలు ప్రేమ్‌కుమార్, కాశీనాథ్,కమల్‌కిశోర్, సునీల్, వీరభద్రం, జ్యోతి, భారతి, వసంత, అనిల్, సుమన్, హెచ్‌ఎం తిరువెంకటచార్యులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి చౌకబారు రాజకీయాలు చేయొద్దు

● మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



గోవిందాపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

గూడూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ చౌకబారు రాజకీయాలు చేయడం మూర్ఖత్వమని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ విమర్శించారు. గూడూరు మండలం జగన్నాయకులగూడెం క్రాస్‌రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు రైతులు మృతి చెందిన విషయం విదితమే. సోమవారం ఎమ్మెల్యే మురళీనాయక్ గోవిందాపురం రెవెన్యూ గ్రామపంచాయతీ శివారు దుబ్బగూడెం, జోష్‌తండాలకు చేరుకుని రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బానోత్ లాల్యా, ధరావత్ వీరన్న కుటుంబాలను పరామర్శించారు. వారి కుటుంబాలకు అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అనంతరం గోవిందాపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యూరియా పంపిణీ విషయంలో బీఆర్ఎస్ నాయకులు రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. మాజీ మంత్రి(మా చిన్నమ్మ) సత్యవతిరాథోడ్ క్యూలైన్‌లో నిలబడిందని పేర్కొన్నారు. డోర్నకల్ ఏడీనిఅడిగితే మీ చిన్నమ్మకు ఐదు ఎకరాలకు 10 బస్తాల యూరియా ఇచ్చామని చెప్పినట్లు పేర్కొన్నారు. ఐదు ఎకరాలకు పది బస్తాలు తీసుకుంటే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ల్యాట్ మార్కెటింగ్ లైన్‌లో నిలబడి బస్తాలు తీసుకుంటున్నట్లు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఐదు ఎకరాలకే 10 బస్తాలు తీసుకుంటే పది.. ఇరవై ఎకరాలు ఉన్న రైతులు ఎన్ని యూరియా బస్తాలు తీసుకోవాలో అని ప్రశ్నించారు.

మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ ఎప్పటినుంచో రాజకీయాల్లో ఉన్నారని, గతంలో స్త్రీ శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేసినట్లు చెప్పారు. అన్ని తెలిసిన వారే చౌకబారు రాజకీయాలు చేయడం మంచికాదన్నారు. యూరియా కోసం తెలంగాణ రైతులు ఇబ్బందులు పడుతుంటే కేంద్ర ప్రభుత్వ వైఖరి పట్ల సత్యవతి స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. సత్యవతిరాథోడ్ రైతు పక్షమా..లేక బీజేపీ పక్షమా... అని ప్రశ్నించారు. తెలంగాణపై సవతితల్లి ప్రేమ చూపిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పోరాడుతున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వానికి అండగా ఉండాల్సింది పోయి.. బీజేపీ పక్షాన నిలబడడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇప్పటికైనా తెలంగాణ రైతాంగం మేల్కొని రాజకీయ ఉచ్చులో పడకుండా రైతులను మోసం చేస్తున్న బీఆర్ఎస్, బీజేపీలకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రతి రైతుకు యూరియా అందించే బాధ్యత కాంగ్రెస్ పార్టీపై ఉందని, కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ప్రధాని మోదీ మెడలు వంచైనా సరే యూరియాను అందిస్తామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాధవపెద్ది రమేష్‌చందర్‌రెడ్డి, వాంకుడోతు కొమ్మాలు, చిట్టి వెంకటేశ్వర్లు, బీరం శ్రీపాల్‌రెడ్డి, బుడిగె సతీష్‌గౌడ్, బొల్లికొండ మధు, నరేష్‌రెడ్డి, చంటి స్వామి, సతీష్‌రావు, రమేష్ పాల్గొన్నారు.

17న ప్రజాపాలనా దినోత్సవం

● జాతీయ పతాకాలు ఎగురవేసేది వీరే

● ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హనుమకొండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నిజాం విముక్తి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 17వ తేదీన నిర్వహించే ప్రజా పాలనా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో జాతీయ పతాకాలను ఆవిష్కరించే మంత్రులు, కార్పొరేషన్ ఛైర్మన్లను ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. మహబూబాబాద్ జిల్లాలో తెలంగాణ లెజిస్లేటివ్ అసెంబ్లీ విప్ జె.రామచంద్ర నాయక్, వరంగల్ జిల్లాకేంద్రంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి సురేఖ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో తెలంగాణ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కోఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్ బెల్లయ్య నాయక్, జనగామ జిల్లాలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ములుగు జిల్లాలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, హనుమకొండ జిల్లాలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జాతీయ పతాకాలను ఎగురవేస్తారు.

నేటి నుంచి విద్యుత్ కాంట్రాక్టర్ల సమ్మె

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కాంట్రాక్టర్ల రేట్లు పెంచాలనే డిమాండ్‌తో మంగళవారం నుంచి విద్యుత్ కాంట్రాక్టర్లు సమ్మె చేపడుతున్నట్లు విద్యుత్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బందు సైదులు తెలిపారు. మహబూబాబాద్ జిల్లా విద్యుత్‌శాఖ కార్యాలయంలో సోమవారం జిల్లా విద్యుత్ శాఖ అధికారి విజయేందర్ రెడ్డికి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 7 సంవత్సరాలుగా కాంట్రాక్టర్లకు సంబంధించి రేట్లు పెంచలేదని, పెరిగిన ధరలకు అనుగుణంగా రేట్లు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కుమార్, విశ్వేశ్వర్‌రావు, సోమిరెడ్డి, నరేష్, శివ పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాన్ని జయప్రదం చేయాలి

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):సెప్టెంబరు 17న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాన్ని జయప్రదం చేయాలని సీపీఐ మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి పిలుపునిచ్చారు. మహబూబాబాద్ వీరభవన్‌లో సీపీఐ పట్టణ కార్యదర్శివర్గ సమావేశాన్నిసోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ...సెప్టెంబర్ 17నరాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, నవీన్, వెంకన్న, వెలుగు శ్రావణ్ పాల్గొన్నారు.

కొత్తల పండుగకు సెలవు మంజూరు చేయాలి

కొత్తగూడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి):ఆదివాసీలు ఈనెల 17న నిర్వహించుకునే కొత్తల పండుగకు సెలవు మంజూరు చేయాలని, ఉమ్మడి మండలంలో గిరిజన దర్బార్‌ను కొనసాగించాలని తుడుందెబ్బ జిల్లా, మండల నాయకులు కుంజ నర్సింగరావు, పూనెం సందీప్‌దొర కోరారు. ఈ మేరకు ఏటూరునాగారంలో సోమవారం ఐటీడీఏ ఏపీవో వసంతరావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో 29శాఖల ఉద్యోగులు, విద్యాసంస్థలకు సెలవివ్వాలని కోరారు

సివిల్ సప్లయీస్ హమాలీల సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సివిల్ సప్లయీస్ హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, హమాలీల స్టేజ్-1 రేట్లు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్, సివిల్ సప్లయీస్ హమాలీ కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వంకాయలపాటి జక్కురయ్య డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం కార్మిక శాఖ అసిస్టెంట్ మేనేజర్ మనోజ్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... గత 20 సంవత్సరాలుగా స్టేజ్-1 లారీ ఎగుమతి, దిగుమతి బస్తాకు రూ.1.25 పైసల చొప్పున మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌తో మాట్లాడి రేట్లు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెలుగు శ్రావణ్, లక్ష్మీనారాయణ, రాజబోయిన శ్రీను, నారాయణ, వీరస్వామి, సర్వయ్య, శ్రీను పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

● జిల్లా విద్యాశాఖాధికారి దక్షిణమూర్తి



మహబూబాబాద్ మోడల్ స్కూల్‌లో విద్యార్థులు తయారుచేసిన హిందీ టీఎల్‌ఎంను పరిశీలిస్తున్న డీఈవో దక్షిణమూర్తి

మహబూబాబాద్ఎడ్యుకేషన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి దక్షిణమూర్తిఅన్నారు. మహబూబాబాద్‌లోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేసి వంట గది, స్టోర్ రూమ్, తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి నాణ్యమైన భోజనం అందించేందుకు నూతన మెనూ రూపొందించిందని, వాటిని తూచ తప్పకుండా అమలు చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థినీ తరగతుల వారీగా కనీస సామర్థ్యాలు సాధించేలా బోధన చేయాలని పేర్కొన్నారు. పదవ తరగతి విద్యార్థినులు వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జీసీడీవో విజయకుమారి, డీఎస్వో అప్పారావు, ప్రత్యేకాధికారి భవాని ఉన్నారు.

హిందీపై ఆసక్తిని పెంపొందించుకోవాలి

విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే జాతీయ భాష హిందీపై ఆసక్తిని పెంపొందించుకోవాలని డీఈవో దక్షిణమూర్తి అన్నారు. జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో హిందీ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు ఏర్పాటు చేసిన హిందీ టీఎల్‌ఎంను పరిశీలించారు. అనంతరం బాలికల హాస్టల్‌ను సందర్శించి హాస్టల్ కేర్‌టేకర్‌ను విద్యార్థినుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకుంటూ వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్వో అప్పారావు, ప్రిన్సిపాల్ ఉపేందర్‌రావు, ఉపాధ్యాయులు స్వరూపరాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజనీర్స్ డే



మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కమిషన్, ఉద్యోగులు



మహబూబాబాద్‌లో ఇంజనీర్ తీగల ఉమామహేష్‌ను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయంలో సోమవారం ప్రముఖ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజనీర్స్ డేను ఘనంగా నిర్వహించారు. భారత రత్న అవార్డు గ్రహీత మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డీఈ ఉపేందర్, ఏఈ కుమార్, నవీన్‌లను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కమిషనర్ టి.రాజేశ్వర్, మేనేజర్ శ్రీధర్, టీపీవో సాయిరాం, ఆర్వో రఘు, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ క్రాంతి పాల్గొన్నారు.

● ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఇంజనీర్స్ డేను పురస్కరించుకుని మునిసిపల్ డీఈ ఉపేందర్, విద్యుత్ డీఈ పెరుమాండ్ల విజయ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు పాలబిందెల మల్లయ్య మాట్లాడుతూ... భారతదేశంలో ప్రాజెక్టుల నిర్మాణంలో ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ముఖ్య పాత్ర పోషించారని చెప్పారు. కార్యక్రమంలో తండా సదానందం, నల్లు సుధాకర్‌రెడ్డి, కళ్లెం వెంకట్‌రెడ్డి, సోమ గోవర్ధన్, కన్నా అశోక్, పరందామయ్య, దాసరి ప్రసాద్, కళ్లెం వీరారెడ్డి, బొడ్డుపల్లి ఉపేంద్రం, రమేష్, శ్రీనివాస్, మహిపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పమ్మి రాజు, కనకయ్య, నాళ్ల లక్ష్మీనర్సింహారావు, శేఖర్, రామస్వామి, మార్కండేయులు, శ్యామ్ పాల్గొన్నారు.

● మహబూబాబాద్ పట్టణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఇంజనీర్స్‌డేను నిర్వహించారు. దేశ తొలి ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బి.వీరన్న మాట్లాడుతూ... దేశంలో ప్రముఖ ప్రాజెక్టుల నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర ఎంతో గొప్పదని చెప్పారు. అనంతరం టీజీహెచ్‌ఎంఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తీగల ఉమామహేష్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పర్కాల రవీందర్‌రెడ్డి, కోశాధికారి కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, రావుల రవిచందర్‌రెడ్డి, పీవీ.ప్రసాద్, బవిరిశెట్టి రాజేశ్వర్‌రావు, వేమిశెట్టి ఏకాంబ్రం తదితరులు పాల్గొన్నారు.

● కేసముద్రం(ఆంధ్రజ్యోతి): కేసముద్రంలోని శ్రీవివేకవర్ధిని హైస్కూల్‌లో సోమవారం ఇంజనీర్ల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి కరస్పాండెంట్ చిర్ర యాకాంతంగౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు.

ముగ్గురిపై దాడికి దారితీసిన 'కోతి' భయం!

(5వ పేజీ తరువాయి)

మంగ్యా సదరు కిరాణా షాపునకు వెళ్లాడు. దీంతో షాపు యజమానులతో వాగ్వాదం తీవ్రస్థాయికి చేరడంతో ఏకంగా రాళ్లతో బాలుడి తాతపై దాడికి దిగారు. ఇది తెలిసి బాలుడి తండ్రి శివలాల్ కూడా అక్కడికి రావడంతో ఆయనను సైతం వదలకుండా షాపు యాజమాన్యం దాడి చేశారు. చివరికి బాధితులంతా సాయంత్రం పొద్దుపోయే సమయానికి కురవి పోలీ‌స్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గండ్రాతి సతీష్ తెలిపారు.

నేటి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్

(5వ పేజీ తరువాయి)

రోగులను అడ్మిట్ చేసుకునే కార్యక్రమాన్ని నిలిపివేయనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 72 ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిరాకరించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.1400 కోట్ల బకాయిలు పేరుకపోయినట్లు ప్రైవేట్ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ ప్రకటించింది. గతంలో ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చినప్పటికీ నిధులు విడుదల చేయక పోవడంతో ఆరోగ్యశ్రీ సేవలు బంద్ చేస్తున్నట్లు ప్రకటించారు.

అత్యవసర రోగులకు ఇబ్బంది

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గుండె సంబంధిత వ్యాధులతోపాటు న్యూరో సంబంధిత వ్యాధుల బారిన పడే వారికోసం అత్యవసర చికిత్స అందించాల్సి ఉంటుంది. ఇలాంటి రోగులు ఇంతకాలం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు సేవలు అందించేవి. సమ్మె కారణంగా ఇకపై వరంగల్ ఎంజీఎం ఆస్పత్రితోపాటు కాకతీయ వైద్యకళాశాల ఆవరణలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిపై భారం పడనుంది. ఇప్పటికే రోగులతో కిటకిటలాడే ఆస్పత్రిపై పెనుభారం పడనుంది. ఎంజీఎం ఆస్పత్రిఏఎంసీ, ఐఎంసీలో పడకల కోసం క్యూలు కడుతున్నారు. నెట్‌వర్క్ ఆస్పత్రుల బంద్‌తో కిక్కిరిసే ప్రమాదం ఉంది.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు అధికారులు సిద్ధం

రోగుల తాకిడిని వైద్య అధికారులు గుర్తించి తాత్కాలికంగా పడకలను పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అదేవిధంగా కొత్తగా నర్సంపేట, ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామలలో వైద్య కళాశాల అనుబంధ ఆస్పత్రులలో సేవలు విస్తృతం చేసేందుకు వైద్యాధికారులు నిర్ణయం తీసుకున్నారు. అత్యవసరమైతేతప్ప వరంగల్‌కు రెఫర్ చేయవద్దని సూచించినట్లు సమాచారం. పండగ ముందు ప్రజారోగ్యానికి వైద్య సేవలు ఆటంకం ఇబ్బందిగా మారనుంది.

చిన్నారుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచాలి

● జిల్లా సంక్షేమ అధికారి శిరీష

డోర్నకల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు అభ్యసన సామర్థ్యాలు పెంచాలని జిల్లా సంక్షేమ అధికారి శిరీష అన్నారు. సోమవారం డోర్నకల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మన్నెగూడెం రైతు వేదికలో నిర్వహించిన పోషణ్ బీ.. పడాయి బీ..అనే కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ.. చిన్నారులకు చిన్ననాటి నుంచే చదువుతో పాటు అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలన్నారు. చిన్నారుల మానసిక పరిస్థితిని సైతం టీచర్లు అంచనా వేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మి, సూపర్‌వైజర్లు రేఖభాయి, శారద, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ హాస్టళ్ల వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

● సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న సీఐటీయూ నేతలు, గిరిజన ఆశ్రమ హాస్టల్ డైలీ వేజ్ వర్కర్లు

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్రమ పాఠశాల హాస్టళ్లలో పనిచేస్తున్న డైలీ వైజ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కుమ్మరికుంట్ల నాగన్న అన్నారు. సదరు డిమాండ్‌తో మహబూబాబాద్‌లోని కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం గిరిజన ఆశ్రమ పాఠశాలలో హాస్టల్ డైలీ వైజ్ కాంటినెంట్ పార్ట్‌టైం వర్కర్లు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాగన్న మాట్లాడుతూ... గత 30 సంవత్సరాలుగా గిరిజన ఆశ్రమ హాస్టళ్లలో డైలీ వైజ్ వర్కర్లు పనిచేస్తున్నా అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2014 కన్నా ముందు నుంచి పనిచేస్తున్న వారందరిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పోకు వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో కుర్ర మహేష్, జ్యోతిబసు, మధు, పోలెపాక వెంకన్న, భూక్య మహేష్, లింగ్యా, తాజుద్దీన్, నాగేశ్వర్‌రావు, శోభ, లత, సుధాకర్, పెనక ముత్తయ్య, జె.మంగ, ఇంద్రమ్మ, నాగరాజు, లత, మంగీలాల్, వెంకన్న, కుమార్, రాములమ్మ, యాకమ్మ, వీరన్న పాల్గొన్నారు.

వైద్యశాఖలో ఖాళీలను భర్తీ చేయాలి

వైద్యశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీచేయాలని ప్రగతి శీల యువజన సంఘం(పీవైఎల్) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా పీవైఎల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సామ పాపయ్య, బట్టు చైతన్య మాట్లాడుతూ.. వైద్యశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించాలని కోరారు. వర్షాకాలంలో దోమలు వ్యాప్తి చెంది సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముందని, వాటిని అరికట్టాలన్నారు. గ్రామాల్లో పాలకవర్గాలు లేక పోవడంతో పారిశుధ్య సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, వాటిని పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో గౌని భద్రయ్య, గుడిబోయిన రమేష్, గువ్వ శ్రీను, బండ్ల భాస్కర్, మాలోతు శ్రీను, చిలుక సహదేవ, గౌని మల్లేష్ పాల్గొన్నారు.

పట్టాదార్ పాసుపుస్తకాల కోసం రైతుల ఆందోళన

గూడూరు మండలం రాజన్‌పల్లి రెవెన్యూ గ్రామంలోని పలు సర్వే నెంబర్లలోని 400 ఎకరాలకు సంబంధించి భూములకు పట్టాదార్ పాసుపుస్తకాలు ఇవ్వాలని పాతతండా రైతులు జిల్లా కలెక్టరేట్ ఎదుట సోమవారం ఆందోళనకు దిగారు. గతంలో రెవెన్యూ పహాణీలో తమ పేర్లు ఉన్నాయని, తమకు ఎలాంటి పట్టాదార్ పాసుపుస్తకాలు లేవని ఎంజాయ్‌మెంట్ సర్వే పూర్తయిందని, దాని ప్రకారం పాసుపుస్తకాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో డి.శ్రీనివాస్, మోహన్, రాజు, కన్న, హేమ్లా, భద్యా, రవి, గణేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.